క్లుప్తంగా

నేడు నాలుగు మండలాలకు విద్యుత్ బంద్

కడెం: నియోజకవర్గంలోని ఖానాపూర్, కడెం, దస్తురాబాద్, పెంబి అనే నాలుగు మండలాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ నాగరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిర్మల్ నుంచి వచ్చే ప్రధాన లైన్‌కు మరమ్మతుల కారణంగా ఉదయం 8:30 నుంచి 9:30 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దుకాణాల తొలగింపు



తొలగింపు పరిశీలిస్తున్న చైర్మన్

నిర్మల్‌టౌన్: రోడ్లపై వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో రోడ్లపై ఉన్న తోపుడు బండ్లు, దుకాణాలను క్రేన్ సాయంతో తొలగించారు. చైర్మన్ మాట్లాడుతూ రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, టీపీవో సుమలత, టీపీఎస్ నవీన్, కౌన్సిలర్లు, సిబ్బంది ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. సీఐ డి. రాజారెడ్డి, ఎస్సై షరీఫ్, ఏఎస్సై తారచంద్, సుదర్శన్, సిబ్బంది మొక్కలు నాటారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

భైంసాటౌన్: బడీడు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నారాయణ్‌సింగ్ అన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా మంగళవారం పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీ చేపట్టారు. ఓ దుకాణంలో పని చేస్తున్న బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించారు. కౌన్సెలర్ శైలజ, ఐసీపీఎస్ సిబ్బంది శ్రీదేవి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించాలి

ఖానాపూర్: ఉపాధి పనులు చేసిన కూలీలకు చెల్లించాల్సిన డబ్బులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్‌ఆర్ ఉపాలి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించకుంటే కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

స్వల్పకాలిక రకాలను ఎంచుకోవాలి

కుంటాల: వరి సాగులో రైతులు స్వల్పకాలిక రకాలను ఎంపిక చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని జగిత్యాల జిల్లా పొలాస శాస్త్రవేత్తలు గోన్య నాయక్,మాధవి సూచించారు. మంగళవారం కుంటాల రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు పంటల్లో కలుపు నివారణ, మందుల పిచికారీపై అవగాహన కల్పించారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో భైంసా ఏడీఏ వీణ, ఏవో సోమలింగారెడ్డి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

శీత్లా భవాని వేడుకలు

దస్తురాబాద్: మండలంలోని మున్యాలతండా, ఎర్రగుంటలో మంగళవారం బంజారాల ఆరాధ్యదైవం శీత్లాభవానీ పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా తండాల శివారులోని ప్రధాన కూడలి వద్ద సీత్లా భవానిని ప్రతిష్ఠించారు. మహిళలు, యువతులు బోనాలతో వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పశుసంపద, పంటలు బాగుండాలని మొక్కుకున్నారు.

గుట్కా విక్రయిస్తే చర్యలు

నర్సాపూర్(జి): గుట్కా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. పక్కా సమాచారం మేరకు మండలంలోని అర్లి(కే) గ్రామంలో మంగళవారం సిందే వినాయక్, శ్రీరాస్ సురేశ్ దుకాణాల్లో దాడి చేసి గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. అనంతరం ఇరువురిని తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేశారు.

అసంపూర్తి పనులతో కష్టాలు

- బిల్లులు రాక పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- నత్తనడకన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు



బెల్గాంలో కూల్చివేసిన ప్రాథమికోన్నత పాఠశాల భవన స్థలం



కుభీర్ ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా భవనం

కుభీర్: ప్రైవేటుకు ధీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సర్కారు బడుల్లో సౌకర్యాలు కల్పించేందుకు మన ఊరు– మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మొదటి విడతలో కుభీర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న 24 పాఠశాలలను ఎంపిక చేసింది. కొన్ని చోట్ల పనులు పూర్తవగా.. మరికొన్ని పాఠశాలల్లో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మరికొన్ని పాఠశాలల్లో పనులు అసలు ప్రారంభించనే లేదు. మన ఊరు– మన బడి కింద బెల్గాం, కుభీర్, పల్సి పాఠశాలలు ఎంపికైనా పనులు చేపట్టలేదు. రాంనాయక్ తండా, దావుజీ నాయక్‌తండా, కస్రా, దార్‌కుభీర్, పార్డీ(బి), కుప్టి గ్రామాల్లో ఎంపికైన ప్రాథమిక పాఠశాలల్లో, చాత గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పనులు పూర్తయినా ఒక రూపాయి కూడా బిల్లు రాలేదు. మిగిలిన 14 పాఠశాలల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. తమకు బిల్లులు రాక పనులు నిలిపివేసినట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జరిగిన పనులకు వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

పథకం పేరు మార్చినా..

గత డిసెంబర్‌లో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం మన ఊరు– మన బడి కార్యక్రమాన్ని అమ్మ ఆదర్శ పాఠశాలగా పేరు మార్చింది. ప్రతి పాఠశాలలో కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించింది. అందులో భాగంగా కుభీర్ మండలంలోని ఆయా గ్రామాల్లో 65 పాఠశాలల్లో మరమ్మతులు చేయాలని ఎంపిక చేసింది. వీటి నిర్మాణ బాధ్యతలను స్కూల్ కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగించింది. పాఠశాలల పునప్రారంభం(జూన్ 12) నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించింది.

నత్తనడకన మరమ్మతులు

పాఠశాలలు పునఃప్రారంభమై సుమారు నెల రోజులు అవుతున్నప్పటికీ పనులు పూర్తికాలేదు. దాదాపు 40 పాఠశాలల పనులు పూర్తయినట్లు తెలంగాణ విద్యామౌలిక వసతుల సంస్థ(టీజీఈడబ్ల్యూడీసీ)అధికారి తెలిపారు. మరో 20 పాఠశాలల్లో పనులు కొనసాగుతుండగా.. మిగిలిన ఐదు పాఠశాలల్లో ఇటీవల పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పనుల ప్రారంభానికి మందే వీటిలో 30 పాఠశాలలకు 25శాతం నిధులు పాఠశాలల అకౌంట్లలో జమయ్యాయి. మిగతా వాటికి నిధులు రాలేదు.

పనులు పూర్తయినా బిల్లులు రాలేదు

మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల మన ఊరు–మన బడి కింద ఎంపికైంది. కాంట్రాక్ట్ పనులు నేనే చేపట్టా. రెండు గదులు నిర్మించడంతోపాటు భవనానికి మరమ్మతులు చేయించా.. రంగులు వేయించా. ప్రభుత్వం రూ.27లక్షలు కేటాయించగా.. ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదు. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలి.

– విష్ణు, కాంట్రాక్టర్, పార్డి(కె)

నిధులు రావాల్సి ఉంది..

మన ఊరు–మన బడి కింద చేపట్టిన పనులకు సంబంధించి నిధులు రాలేదు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు మాత్రం 25శాతం నిధులు ముందే వచ్చాయి. మిగతా బిల్లులు రావాల్సి ఉంది.

– మహేశ్, టీజీఈడబ్ల్యూడీసీ ఏఈ, కుభీర్

ప్రజల భద్రత కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్

దస్తురాబాద్: శాంతి భద్రతల పరిరక్షణతోపాటు ప్రజలకు భద్రత కల్పించేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఖానాపూర్ సీఐ సైదారావ్ పేర్కొన్నారు. మంగళవారం మండంలోని మున్యాల గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని.. అపరిచితుల నుంచి ఫోన్లు ఎలాంటి సమాచారం చెప్పవద్దన్నారు. మైనర్లకు వాహనాలిస్తే యాజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాల్లేని 89 ద్విచక్ర వాహనాలు, 3ఆటోలకు జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎస్సైలు శంకర్, లింబాద్రి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ సైదారావ్

ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు

భైంసాటౌన్: పట్టణంలోని వివేకానందచౌక్ లో మంగళవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ భైంసా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్‌ఎఫ్ఎస్ జిల్లా కన్వీనర్ శివ మాట్లాడుతూ దేశం, ధర్మ రక్షణ కోసం విద్యార్థులు పాటుపడాలన్నారు. నగర కార్యదర్శి చంద్రకాంత్, సాయికిరణ్, అక్షయ్, సందీప్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని లారీ అడ్డా వివేకానంద చౌక్‌లో మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, కిషన్‌రెడ్డి, దుర్గప్రసాద్, సంతోశ్, సాయిప్రణయ్, భీమేశ్, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్: పూలమాల వేస్తున్న నాయకులు

అవకాశాలు సృష్టించుకోవాలి

కుంటాల: అవకాశాల కోసం ఎదురుచూడకుండా మనమే సృష్టించుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు వాడేకర్ లక్ష్మణ్, తోట లక్ష్మణ్ సూచించారు. మంగళవారం కుంటాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. పట్టుదలతో ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో నిలవాలని పేర్కొన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రనాగ కాంత్, కళాశాల ఇన్‌చార్జి కార్గాం వినోద్‌కుమార్, సగ్గం గంగాధర్, ధర్మాజీ, మారుతి, రతన్‌కుమార్, చిన్నారెడ్డి, భూమన్న పాల్గొన్నారు.

సీతక్క పుట్టినరోజు వేడుకలు

దస్తురాబాద్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం మంత్రి సీతక్క పుటిన రోజు వేడుకలను ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్, మాజీ ఎంపీపీ కిషన్, రాజేశం, గోపి, తదితరులున్నారు.

విద్య, వైద్యం, సేద్యానికే ప్రాధాన్యం

- ఎమ్మెల్యే బి.రామారావ్ పటేల్

కుభీర్: విద్య, వైద్యం, సేద్యానికే తొలి ప్రాధాన్యమిస్తానని ముధోల్ ఎమ్మెల్యే బి.రామారావ్ పటేల్ అన్నారు. మండలంలోని పార్డి(బి)గ్రామంలో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రూ.13.5 లక్షలతో నిర్మించే గ్రంథాలయ భవనానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నిధులు మంజూరు కాగానే గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించి రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలంతా ఐక్యంగా ఉంటూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి మనోహర్, తహసీల్దార్ ఎం.సోము, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో గోవర్ధన్ డీఈ గంగాధర్‌గౌడ్, ఏఈ మహేశ్, ఏఈవో చంద్రకాంత్, వైద్యులు అవినాశ్, ప్రణయ్, బి.విఠల్, నాయకులు నాగేశ్, వెంకట్రావ్, గులాబ్, దత్తాత్రి, సాయినాథ్, సంతోష్ ఉన్నారు.

ఉద్యోగాలివ్వాలని వినతి..

భైంసాటౌన్: తమకు ఉద్యోగాలు ఇప్పించాలని ఎమ్మెల్యే రామారావ్ పటేల్‌ను వీఆర్ఏల వారసులు కోరారు. ఈమేరకు మంగళవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. 81, 85 జీవో ప్రకారం 61 ఏళ్లు నిండిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో లేవనెత్తుతానని.. జీవో ప్రకారం ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వీఆర్ఏల వారసులు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని వీఆర్ఏల వారసులు భూమన్న, సాయినాథ్, అనిల్, సురేశ్, నవీన్, పోతన్న తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

నిర్మల్‌చైన్‌గేట్: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ.. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం వన మహోత్సవం, మహిళాశక్తి, అమ్మ ఆదర్శ పాఠశాలలు, ధరణి, సీజనల్ వ్యాధులు, ప్రజాపాలన సేవా కేంద్రాలు, ఉద్యోగుల బదిలీలు తదితర అంశాలపై వారు జిల్లాల వారీగా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జూన్ మాసంలో రాష్ట్ర సీఎం వరంగల్‌లో వనమహోత్సవం ప్రారంభించి.. రాష్ట్రవ్యాప్తంగా 20 కోట్లకుపైగా మొక్కలు నాటాలనే లక్ష్యం నిర్దేశించారని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను జియో ట్యాగ్ చేయాలని సూచించారు. ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేయడమే మహిళాశక్తి పథకం ముఖ్య ఉద్దేశమని..ఈ పథకాన్ని జిల్లాల్లో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా పలు రకాల సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాల్లో మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం, ప్రోత్సహించడం, ఆర్థిక సహకారం అందించడం, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలని, సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డెంగీ, మలేరియా, అతిసార వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులను వెంటనే చేయాలని అన్నారు. ఉద్యోగుల బదిలీ ప్రక్రియను నిబంధనలు పాటిస్తూ పూర్తిచేయాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమం విజయవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కకి జియో ట్యాగింగ్ చేసి.. సంరక్షించాలని సూచించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పలు అంశాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ బడుల్లో చేపట్టిన పనుల్లో మిగిలిన వాటిని వెంటనే పూర్తిచేయాలన్నారు. జిల్లా సమాఖ్యలు మండల సమాఖ్యలతో సమావేశాలు ఏర్పాటు చేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో రైతులంతా విత్తనాలు నాటారని.. సాగు విస్తీర్ణం, పంటల వివరాలను అంచనా వేసి సరిపడ ఎరువులను అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. మురుగునీటిలో యాంటీ లార్వాలు వృద్ధి చెందకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, శాఖల వారీగా ఖాళీలు, బదిలీలకు అర్హత ఉన్న వారి జాబితాను సిద్ధం చేసి.. నిబంధనల మేరకు ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, అటవీ అధికారి ప్రసాద్, డీఆర్వో భుజంగ్‌రావ్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో గోవింద్, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, డీఈవో రవీందర్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మణచాంద: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య కార్యకర్త శివకృష్ణగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పీచర గ్రామంలో రోడ్లపై నిలిచిన నీటిలో పంచాయతీ వర్కర్లతో ఆయిల్ బాల్స్ వేయించారు. ప్రజలు దోమతెరలు వినియోగించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సాయిప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన

సారంగాపూర్: మండల కేంద్రంలో మంగళవారం పారిశుధ్యంపై పంచాయతీ, వైద్య సిబ్బంది పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. పాతటైర్లు, పాతడబ్బాల్లో వర్షపునీరు నిల్వ కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మణికుమారి, రాజేందర్, అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, కారోబారి ఉమామహేశ్వర్ తదితరులు ఉన్నారు.



లక్ష్మణచాంద: ఆయిల్ బాల్స్ వేయిస్తున్న శివకృష్ణ

టూరిజం చైర్మన్‌ను కలిసిన నాయకులు

కడెం: రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డిని మంగళవారం మాజీ ఎంపీపీ ఆంథొని అలెగ్జాండర్ హైదరాబాద్‌లోని తన శాఖ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభా కాంక్షలు తెలిపారు. కడెం ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు.

లక్ష్మణచాంద: తెలంగాణ రాష్ట్ర పర్యాటక డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పటేల్ రమేశ్‌రెడ్డిని మంగళవారం మండల నాయకులు కలిశారు. హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో బాధ్యతలు చేపట్టిన వారిని డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, తదితరులు కలిసి సన్మానించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటరాజు, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, సురేశ్‌రెడ్డి, నరేశ్, సుమన్, సుధాకర్ తదితరులున్నారు.



లక్ష్మణచాంద: పుష్పగుచ్ఛం ఇస్తున్న నేతలు

ఎన్నికల హామీలు అమలు చేయాలి

కడెం: ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు ముక్కెర గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం సమర్పించారు. రైతుభరోసా, రూ.రెండు లక్షల రుణమాఫీ , వరికి క్వింటాల్‌కు 500 బోనస్ తక్షణమే అమలు చేయాలని కోరారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కల్లెం రమణారెడ్డి, కోశాధికారి తిరుమలయ్య, కార్యదర్శి ముల్కి కృష్ణ, సత్తెన్నయాదవ్, రవీందర్‌గౌడ్, ప్రవీణ్, శ్రీరామ్, రాజేశ్వర్, భూమన్న ఉన్నారు.

లక్ష్మణచాంద: ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు ముత్యంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కిసాన్ మోర్చా మండలశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తహసీల్దార్ జానకికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు పోలాస గోవర్ధన్, ఉపాధ్యక్షులు రంజిత్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, శ్రీనివాస్, సాయన్న, ముత్తన్న, గంగాధర్ పాల్గొన్నారు.

ఖానాపూర్: హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. హామీలు అమలు చేయకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోశ్, మండలాధ్యక్షుడు టీకు ప్రకాశ్, పెద్ది రమేశ్, కొండవేణి రమేశ్, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, రవి, శ్రీనివాస్, నరేశ్, తదితరులున్నారు.



కడెంలో తహసీల్దార్ సుజాతకు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

జూనియర్ కళాశాల అభివృద్ధికి విరాళం

కుంటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కుంటాలకే చెందిన సృజన విద్యానిలయం ప్రిన్సిపాల్ కొత్తకాపు గంగన్న రూ.5వేలను విరాళంగా సీడీసీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు కుర్ర నవీన్, కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

కుంటాల: ప్రజల భాగస్వామ్యంతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో ఎం ఏ. రహీం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఖాళీస్థలం, వ్యాపార సముదాయం, మేకల సంత నిర్వహణకు వేలంపాట నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యాపారం చేసుకునేందుకు ఖాళీస్థలాన్ని సద్దాం, గడ్డం నవీన్‌రెడ్డి, ఎస్.హైమద్, కె.ఆలూరి ప్రశాంత్, ఎస్‌కే.పాషా రూ.2,51,500కు వేలం పాడి దక్కించుకున్నారని అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర గిట్టుబాటు కాకపోవడంతో వ్యాపార సముదాయం, మేకల సంత నిర్వహణకు వేలం పాటలో పాల్గొనేందుకు ఆసక్తి కనబరచలేదు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సోమలింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి భోజన్న, కారోబార్ మోహన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో పని చేసిన హెచ్‌ఎం ఎల్లన్న, ఉపాధ్యాయురాలు ఉమారాణి ఇటీవల బదిలీపై వెళ్లారు. కాగా వీరిని మంగళవారం పాఠశాలలో గ్రామస్తులు, పోషకులు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం ఫణిందర్, ఏఏపీసీ చైర్మన్ లక్ష్మి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ బాబారావు, పంచాయతీ కార్యదర్శి సారిక, చంద్రకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని మన్మద్‌లో తాజా మాజీ ఎంపీపీ బాయమొల్ల లలితతోపాటు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మంగళవారం పాఠశాలలో గ్రామస్తులు సన్మానించారు. మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, నారాయణ, భోజారెడ్డి తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేసి బదిలీపై సిద్దులకుంట వెళ్లిన కడారి దశరథ్‌ను సన్మానించారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనకు సన్మానం చేశారు.

లోకేశ్వరం: మండలంలోని రాజూర ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సురేశ్‌రావు బదిలీపై హవర్గా వెళ్లగా మంగళవారం పాఠశాలలో ఆయనను సన్మానించారు. పీఆర్టీయూ నాయకులు రాజారాం, మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, విశ్రాంత ఎంఈవో రవీందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, ప్రవీణ్, పోతన్న, అనిల్, రమేశ్ ఉన్నారు.

మురుగునీరు మళ్లించారు..

సాక్షి స్పందన

సారంగాపూర్: మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో నిర్మల్–స్వర్ణ ప్రధాన రహదారిపై మురుగునీరు నిలిచి గుంతలు ఏర్పడిన విషయం తెలిసిందే. దీనిపై ఈనెల 5న సాక్షిలో 'మురుగునీరు వెళ్లేదెలా'శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయించారు. డ్రెయినేజీని తవ్వించి తాత్కాలికంగా మురుగునీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. గ్రామస్తులతో చర్చించి రోడ్డు పనులను, మురుగు కాల్వ నిర్మాణం చేపడుతామని ఆర్అండ్‌బీ ఏఈ శారీక్ అలీ తెలిపారు.



గుంతలు పూడ్చిన అధికారులు